

మహిళపై లైంగికదాడికి మాంత్రికుడి యత్నం

క్షుద్రపూజల నెపంలో ఓ మహిళపై లైంగికదాడికి యత్నించిన మాంత్రికుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. -8లో



సిక్సర్ల మోత

చంద్రగిరి ఐపీఎల్‌లో మంగళవారం సిక్సర్ల మోత మోగింది. పల్లెటూరి యువకుల బాదుడుకు బంతి మైదానం బయటకు పరుగులు పెట్టింది. -8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	41	27
తిరుపతి	41	27
తిరుమల	37	24
గూడూరు	43	30
నగరి	42	28

న్యూస్‌రీల్

దేశమ్మ దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్లు



దర్శన టికెట్ అందిస్తున్న వేణుబాబు

నగరి : పట్టణంలోని టీఆర్ కండ్రిగలో ఉన్న నేత్రదేవత దేశమ్మ ఆలయంలో అమ్మవారి దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశమ్మ దేవత ఆలయానికి విచ్చేసేవారు ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లతో పాటు, రూములు, సేవలు కూడా బుక్‌చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సీకే దయానిధి, ధర్మకర్తలు పూర్ణిమ, రాజేష్ పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 1,095 మంది హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్‌కు మొత్తం 1,095 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన ఈ పరీక్షకు 1,178 మందికి గాను 83 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని డీఎస్సీ– 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు బుధవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు కాంట్రాక్టు బేసిక్ లో మినిమమ్ టైం స్కేల్ లో పని చేసేందుకు ఆన్‌లైన్‌లో విల్లింగ్ ఇచ్చారన్నారు. వారిలో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయని వారు ఉదయం 10 గంటలకు చిత్తూరు డీఈవో కార్యాలయాలనికి హాజరుకావాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 70,366 మంది స్వామివారిని దర్శించుకోగా.. 38,653 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తుండగా.. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

వడగాల్పులకు జాగ్రత్త!



మాట్లాడుతున్న డీసీఎల్ బాలునాయక్

తిరుపతి రూరల్: వేడి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కార్మికశాఖ తిరుపతి జిల్లా ఉప కమిషనర్ బాలునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతిలోని డీసీఎల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో పనిచేసే చోట కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం యజమాన్యలు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట ఉద్యోగులు, కార్మికుల పనివేళలను రీషెడ్యూల్ చేయాలని చెప్పారు.

పెద్దపంజాణి ఎంఈఓ సస్పెన్షన్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెద్దపంజాణి ఎంఈఓ హేమలతను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హేమలతపై పలు అభియోగాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నాడు–నేడు పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ మేరకు మదనపల్లె డీవైఈఓ కృష్ణప్పతో విచారణ చేయించామని, ఆయన నివేదిక మేరకు ఎంఈఓపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

హోరుగాలి

తిరుపతి రూరల్: విద్యుత్‌శాఖకు హోరుగాలి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 3.35 నుంచి 4.15 గంటల మధ్య వీచిన పెనుగాలి బీభత్సం సృష్టించింది. తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి రూరల్, ఏర్పేడు, పాపానాయుడుపేట, ఎండీ పుత్తూరు సెక్షన్ల పరిధిలో దాదాపు 20 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గంగరంగ సంబరం

శక్తిస్వరూపిణీ పాహిమాం.. సర్వలోకహితప్రదాయినీ రక్షమాం.. అంటూ భక్తులు తన్మయత్వం చెందారు. జాతర వేళ.. తెర తొలగిన జామునే అమ్మవారి సేవకు పోటెత్తారు. విశేషాలంకరణలో సింహవాహనంపై కొలువుదీరిన తేజోమయరూపాన్ని వీక్షించి పులకించారు. మహిమాన్వితమైన గ్రామదేవత గంగమ్మతల్లిని దర్శించుకుని పరవశించారు. వివిధ వేషాలను ధరించి తల్లిని స్మరిస్తూ భక్తజనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో అంబలి సమర్పించుకుని తరించారు.

- వైభవంగా నడివీధి గంగమ్మ జాతర
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- జనంతో కిక్కిరిసిన చిత్తూరు
- పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



గిరింపేట గంగజాతరలో తొలిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



కొంగారెడ్డిపల్లె జాతరలో అమ్మవారి మంగళసూత్రం చూపుతున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు రూరల్ : నగరంలోని నడివీధిలో గంగమ్మ జాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా సోమవారం అర్ధరాత్రి బజారువీధిలోని గంగమ్మ ఆలయం వద్దకు సింహవాహనం తీసుకువచ్చి అమ్మవారి శిరస్సును కొలువుదీర్చారు. విశేష ఆభరణాలు, గాజులు, సుగంధ పుష్పాలు, నిమ్మకాలతో కనులపండువగా అలంకరించారు. వేకువజామున 4గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కైంకర్యాలను సమర్పించారు. అనంతరం 5గంటలకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సీకే బాబు దంపతులు చేతులమీదుగా నడివీధి గంగమ్మకు ఏర్పాటు చేసిన తెరను తొలగించి, జాతర మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. అమ్మవారికి గజమాల సమర్పించి తొలి పూజ చేశారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. అప్పటికే ఆలయం వద్దకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేసవి తీవ్రత ఇబ్బంది పెడుతున్నా లెక్కచేయకుండా భక్తుల రద్దీ కొనసాగింది. రాత్రి పిండివంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. జాతర సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా వివిధ వేషాలు ధరించిన భక్తులు గంగమ్మను సేవించుకున్నారు.

అంబలి సమర్పణ

అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమై అంబలి సమర్పణకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మండపం ముందు ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద డ్రమ్‌లలో భక్తులు ఇంటి నుంచి తీసుకువచ్చిన అంబలిని పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు పవిత్ర ప్రసాదమైన అంబలిని తమ నివాసాలకు తీసుకెళ్లారు. మిగిలిన అంబలిని జాతక కమిటీ వారు గోశాలకు తరలించారు.



అమ్మవారి సేవలో వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు

స్వచ్ఛందంగా సేవలు

వేసవి నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. మజ్జిగ, శీతపానీయాలను ఉచితంగా పంపిణీ చేశాయి. అన్నదానాలు చేపట్టాయి.

సారె సమర్పించిన విజయానందరెడ్డి

ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నడివీధి గంగమ్మకు సారె, గజమాల సమర్పించారు. గాంధీ విగ్రహం నుంచి వివిధ కళాప్రదర్శనలు, బ్యాండు మేళం, డ్రమ్స్, కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ భారీ ర్యాలీగా తరలివెళ్లి సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆయనను జాతర నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అలాగే కొంగారెడ్డిపల్లె జాతరలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డితో కలిసి తొలిపూజ చేశారు. సింహవాహనంపై కొలువుదీరిన అమ్మవారి సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

సంతపేటలో..

సంతపేట జాతరను పురస్కరించుకుని గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త భూపేష్ గోపినాథ్ గజమాల సమర్పించి తొలిపూజ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గిరింపేటలో ఎమ్మెల్యే తొలిపూజ

నగరంలోని గిరింపేట గంగ జాతరలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉదయం 6.30గంటలకు అమ్మవారికి తొలిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంగమ్మ కరుణతో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. అనంతరం జాతర కమిటీ చైర్మన్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముదను ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలోనే మురకంబట్టు అమ్మవారిని ఎమ్మెల్యే, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ దర్శించుకున్నారు. అనంతరం సంతపేటకు చేరుకుని అమ్మవారికి పూలమాల సమర్పించారు.





నడివీధి గంగమ్మ దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



సంతపేటజాతరలో తొలిపూజ చేస్తున్న భూపేష్ గోపీనాథ్





అంబలిపోస్తున్న భక్తులు

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

సాక్షి,చిత్తూరు : పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు. మంగళవారం జిల్లా సచివాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని వర్గాలకు ప్రజలకు అర్థమయ్యేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. పర్యావరణానికి అనుకూలంగా జీవన విధానాన్ని మార్చుకునేలా దిశానిర్దేశం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, నీటి వృథాను అరికట్టడం, నీటి యాజమాన్య పద్ధతులపై చైతన్యవంతం చేయాలని కోరారు. సామాజిక అడవుల పెంపకం, పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేయడంలో ప్రజలతోపాటు విద్యార్థులను భాగస్వాములు చేయాలని స్పష్టం చేశారు. వాయుకాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వాటిల్లే నష్టాలను వివరించాలని తెలిపారు. సంబంధిత ఫొటోలు, వీడియోలను వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ రక్షణకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం కనీస ధర్మమని తెలిపారు. అనంతరం ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సమష్టిగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నరేంద్ర బాబు, ఏఈ మదన్‌మోహన్ రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, డీపీఓ లక్ష్మి, ఆర్‌డీఓలు రేణుక, సుజన, శివయ్య, మున్సిపల్ కమిషనర్ అరుణ, ట్రాన్స్‌కో ఈఈ శ్రీహరి, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి మునికృష్ణారెడ్డి, అబ్దుల్ గయాజ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి

టిడ్కో ఇళ్ల పురోగతిపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : టిడ్కో గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో ఇళ్ల పురోగతిపై సమీక్షించారు. జూన్ నెలాఖరుకు టిడ్కో గృహాలను పూర్తి చేయాలన్నారు. ఇళ్ల సముదాయం వద్ద అప్రోచ్ రోడ్లు, నీటి వసతి, ప్రహరీ గోడల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు అవసరమైన రుణాలను బ్యాంకుల నుంచి మంజూరు చేయించేందుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని తెలిపారు. సమావేశంలో మెప్మా పీడీ రాధమ్మ, చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ అరుణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న కరుణకుమార్

పలమనేరు : జిల్లా, మండల సాధికార సంస్థల ద్వారా పేదలకు ఉచితంగా న్యాయసేవలందిస్తున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కరుణ కుమార్ తెలిపారు. మంగళవారం పలమనేరు షికారీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి మండల లీగల్ అథారిటీ సేవలు అందిస్తుందన్నారు. ఇందుకోసం స్థానిక కోర్టులో సంప్రదించాలని సూచించారు. అనతరం స్థానిక రోప్స్ సంస్థ ద్వారా షికారీలు, గిరిజనులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ పుష్పగిరినాయక్, ఆర్ఐ సూర్య నాయక్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ధనశేఖరన్, శ్రీలత పాల్గొన్నారు.

వేణుగోపాలా.. సర్వభూపాలా



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కార్వేటినగరం : శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం రాత్రి ఉభయదేవేరీ సమేతంగా స్వామివారు సర్వభూపాల వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. ముందుగా ఉదయం వేణుగోపాలుని సర్వాంగసుందరంగా ముస్తాబు చేసి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి ఊరేగారు. అనంతరం వేదపండితులు మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉభయనాంచారులతో వేణుగోపాల స్వామివారికి కనులపండువగా కల్యాణమహోత్సవం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీవారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం నూతన వధూవరులను అలంకార మండపంలోకి వేంచేపు చేశారు. సుగంధ సుమాలు, పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో కనువిందుగా అలంకరించి, సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ దేవేరులతో కలిసి స్వామివారు భక్తులను కటాక్షించారు. రాత్రి 10 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయాధికారులు సురేష్‌కుమార్, నాగరాజు, కంకణ భట్టు గోపాలాచారి, వేదపండితులు దాసరథి ,కిరణ్ భట్టాచార్యులు, సుందరవరదాచార్యులు పాల్గొన్నారు,

నేడు గరుడోత్సవం

శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అయిదోరోజు బుధవారం గరుడోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో ఉదయం శ్రీవారు మోహినీ అవతారంలో భక్తులను కటాక్షించనున్నట్లు వివరించారు.

టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17 నుంచి జూన్ 5వ తేదీలోపు విద్యార్థులు 'ఏడీఎంఐఎస్ ఎస్ఐటీఎస్.టీఐఆర్‌యూఎంఏఎల్ఏ.ఓఆర్‌జీ' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం ఇంగ్లిష్‌లోనే ఉంటుందని, అయితే విద్యార్థుల సౌకర్యార్థం యూజర్ మాన్యువల్, ఆయా కళాశాలల ప్రాస్పెక్టస్‌ను ఇంగ్లిష్, తెలుగులో ఉంచామని తెలిపారు. ఇంగ్లిష్, తెలుగులో ఉన్న దరఖాస్తు చేసే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అలాగే ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్న గ్రూపులు, సీట్లు, ప్రవేశానికి అర్హతలు, సీట్ల భర్తీ విధానం, మార్గదర్శకాలు తదితర వివరాలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ముగిశాక విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఆయా కళాశాలల్లో సీట్లను తాత్కాలింగా ఆన్‌లైన్‌లో కేటాయించి, ఆ వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా విద్యార్థులకు పంపుతామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసేటప్పుడు కచ్చితమైన వివరాలు, సరైన ధ్రువీకరణ పత్రాలను అందించాలని, లేనిపక్షంలో దరఖాస్తు రద్దవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసేటప్పుడు సందేహాలకు పైన తెలిపిన వెబ్‌సైట్‌లోని హెల్ప్‌లైన్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

బ్రాగ్‌సెట్‌లో ఎంపికైన విద్యార్థులకు రెండో దశ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఇటీవల నిర్వహించిన బ్రాగ్‌సెట్ ఇంటర్ ప్రవేశ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు 2వ దశ పరీక్షకు హాజరు కావాలని కో–ఆర్డినేటర్ జయభారతి తెలిపారు. మంగళవారం ఆమె ఐఐటీ, నీట్ మెడికల్ అకాడమీలో ప్రవేశం నిమిత్తం ఈనెల 21వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను www.apgpcet.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు వివరించారు. వీరు మాత్రమే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. సత్యవేడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి, హాల్‌టికెట్‌లో సూచించిన సమయానికి ముందుగానే విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 7995562127 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

యువతకు ఉపాధి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా వారి ఉపాధి కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత నైపుణ్యాలు సంపాదించి జీవనోపాదులు పొందేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. బహుళ జాతి కంపెనీలతో సంప్రదించి జాబ్‌మేళా నిర్వహణకు సిద్ధం కావాలని చెప్పారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఉన్న వివిధ బహుళ జాతి కంపెనీలతో సంప్రదించాలన్నారు. హెచ్‌సీఎల్ కంపెనీలో ఉపాధికల్పన విషయమై సంబంధిత అధికారులతో చర్చించాలని తెలిపారు. చిరుధాన్యాలతో తయారు చేసే ఆహార ఉత్పత్తులకు సంబంధించి స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన శిక్షణ నువ్వాలన్నారు. సమీక్షలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడికి మాంత్రికుడి యత్నం


నిందితుడు సుబ్బయ్య అరెస్ట్ చూపుతున్న రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి


బాధితురాలి మెడపై గోళ్లతో రక్కిన గాయాలు

రేణిగుంట : చేతబడి అనుమానంతో తన వద్దకు వచ్చిన మహిళను ఓ మాంత్రికుడు నగ్నంగా పూజలో పాల్గొనాలంటూ బలవంతం పెట్టాడు. మాట వినకపోవడంతో ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. కామాంధుడి బారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పరారైన మాంత్రికుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో జరిగింది. ఈ వివరాలను రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి మీడియాకు వెల్లడించారు. తారక రామానగర్‌కు చెందిన 35 ఏళ్ల మహిళకు ఇటీవల అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఆస్పత్రులకు వెళ్లినా తగ్గకపోవడంతో.. తనకు ఎవరైనా చేతబడి చేశారేమోనని ఆందోళన చెందింది. దీంతో వారం కిందట శ్రీకాళహస్తి పట్టణం బహదూర్‌పేటకు చెందిన మాసారపు సుబ్బయ్య వద్దకు వెళ్లింది. ఇంటికి చేతబడి జరిగిందని.. రూ.20 వేలు ఇస్తే క్షుద్రపూజలు చేసి విముక్తి కల్పిస్తానంటూ ఆమెను సుబ్బయ్య నమ్మబలికాడు. రూ.7,500 అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈనెల 14వ తేదీన రాత్రి 10 గంటలకు సుబ్బయ్య కారులో ఆమె ఇంటికి పూజా సామగ్రిని తీసుకువచ్చాడు. ఇంట్లోనే ముగ్గులు వేసి.. గుంతలు తవ్వి కొబ్బరికాయలు, నిమ్మకాయలు పెట్టాడు. ముగ్గుపై నగ్నంగా కూర్చుంటే పూజ ప్రారంభిస్తానని చెప్పగా.. అవాక్కయిన ఆ మహిళ నిరాకరించింది. దీంతో ఆమెపై సుబ్బయ్య లైంగిక దాడికి యత్నించాడు. బయటకు వచ్చేందుకు ఆమె పెనుగులాడుతుండటంతో.. చాకుతో పొడిచేందుకు ప్రయత్నించాడు. సుబ్బయ్యను తోసేసిన బాధితురాలు గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. చుట్టుపక్కల వాళ్లు అక్కడికి వచ్చేలోపే సుబ్బయ్య కారులో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించారు. మంగళవారం ఉదయం రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద సుబ్బయ్యను అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. మంత్రాల పేరుతో చెప్పే మాటలను నమ్మవద్దని సూచించారు. సమావేశంలో ఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కామ మాంత్రికుడు టీడీపీ నేతకు అనుచరుడు


టీడీపీ అధినేత చంద్రబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డితో తో మాంత్రికుడు సుబ్బయ్య

వివాహితపై అఘాయిత్యానికి యత్నించి కటకటాలుపాలైన శ్రీకాళహస్తికి చెందిన సుబ్బయ్య టీడీపీనేతకు ముఖ్య అనుచరుడు. పదేళ్ల కిందట ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్న సుబ్బయ్య తనకు మంత్ర శక్తులు తెలుసని స్థానికులను నమ్మించి శ్రీకాళహస్తిలోని బహదూర్‌పేటలో మంగళ, శుక్ర, ఆదివారాల్లో తన ఇంటి వద్దే అమ్మవారికి పూజలు చేసి తాయత్తులు కడుతూ అందినకాడికి డబ్బులు గుంజుకునే వాడు.

ఎస్టీ సెల్‌లో కీలక పదవి

మాసారపు సుబ్బయ్య టీడీపీ తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్ష పదవిలో కొనసాగుతూ సోషల్ మీడియాలో టీడీపీ వాణిని బలంగా వినిపిస్తున్నాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి నమ్మిన బంటు. అతనిని సుధీర్‌రెడ్డి పార్టీ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు పరిచయం చేసి వారితో ఫొటోలు దిగిన పరిస్థితి. మాంత్రికుడి చాటున తనలోని అసలు రూపాన్ని బయటపెట్టి మహిళలకు మాయమాటలు చెప్పి వశపరుచుకునేవాడనే ఆరోపణలున్నాయి. అయితే తన వెనుక రాజకీయ అండ ఉండడంతో అతని అకృత్యాలను బయటపెట్టేందుకు ఎవ్వరూ సాహసించలేదు.

బొజ్జల సుధీర్ కోసం తాంత్రిక పూజలు

టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డికి ఇతనితో అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ కోవలోనే ఆయన రాజకీయ భవిష్యత్తు బాగుండాలని ప్రతివారం శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదిలో దిగంబరంగా సుబ్బయ్య తాంత్రిక పూజలు చేసి నరబలులు కూడా ఇచ్చాడనే ఆరోపణలున్నాయి.


చిత్తూరు బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,665
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.73,000
రిటైల్ వెండి గ్రాము రూ.76

ఇన్సూరెన్స్ పేరిట టోపీ!

కుప్పం: ఇన్సూరెన్స్ చేసుకుంటే ఫైనాన్స్ ఇస్తామని నమ్మించి మోసం చేసిన ఘటన కుప్పం పట్టణంలోని మోడల్ కాలనీలో మంగళవారం వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు.. ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాలనీలో తిరుగుతూ తమ వద్ద ఇన్సూరెన్స్ స్కీమ్‌లో చేరితే రుణాలు మంజూరు చేస్తామని పలువురిని నమ్మించారు. తొలి విడతగా రూ.2,500 నుంచి రూ.3వేల వరకు చెల్లించాలని కోరారు. ఈ మేరకు సుమారు 70 మంది వరకు రూ.3వేల లెక్కన కట్టారు. అయితే రెండు రోజుల నుంచి సొమ్ము వసూలు చేసిన వ్యక్తులు కాలనీలో కనిపించడం లేదు. దీంతో డబ్బు కట్టిన వారికి అనుమానం వచ్చి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో తాము మోసపోయినట్లు గ్రహించారు. దీనిపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తమలా ఎవరూ మోసపోవద్దని అందులో పేర్కొన్నారు.

నేటి నుంచి ఏనుగుల గణన

• చిత్తూరు జిల్లాలో 3 రోజుల పాటు సర్వే

చిత్తూరు కార్పొరేషన్: సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా ఏనుగుల గణన నిర్వహిస్తారు. కానీ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఏనుగుల గణన చేపట్టనున్నారు. జిల్లాలో చివరిగా 2017లో గణన జరిగింది. జిల్లాలో మొత్తం 83 బీట్లు ఉన్నాయి. అందులో 41 బీట్ల నందు ఏనుగులు సంచరిస్తున్నాయి. ఎక్కువగా 37 బీట్ల వైపు వెళ్తున్నాయి. ప్రాణాంతకమైన సర్వేలో 10 బృందాలు పాల్గొననున్నట్లు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు 15 కిలోమీటర్లు సర్వే చేయనుండగా, 2వ రోజు పాదాలు, పేడ ఆధారంగా, 3వ రోజు అవి నీరు తాగే ప్రాంతాల్లో గణించనున్నారు. కుప్పం నుంచి పలమనేరు వరకు సర్వే జరుగనుంది.

చైన్‌స్నాచింగ్‌పై కేసు నమోదు

చౌడేపల్లె : స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన రాజమ్మ అనే మహిళ మెడలో బంగారు చైన్‌ను ఇద్దరు యువకులు లాక్కెళ్లిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వివరాలు.. రాజమ్మ రోడ్డు పక్కన దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం ఇద్దరు బైక్‌పై అక్కడు వచ్చారు. ఆమె దుకాణంలో వాటర్ బాటిల్ కొనుగోలు చేశారు. లేస్ ప్యాకెట్ కావాలని అడిగారు. ఆమె ఇచ్చేందుకు తిరగగానే మెడలోని చైన్ లాక్కుని పరారయ్యారు. బంగారు గొలుసు 18 గ్రాములుంటుందని, సుమారు రూ.95వేల విలువచేస్తుందని బాధితురాలు వెల్లడించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

దొరవారిసత్రం: నెల్లూరుకు 298 బస్తాలతో తరలిపోతున్న రేషన్ బియ్యం లారీని సీఎస్ డీటీ ఓబయ్య ఆధ్వర్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ ఘటన దొరవారిసత్రం మండలం, నెలబల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. సీఎస్ డీటీ కథనం .. సూళ్లూరుపేట మండలం, మన్నారుపోలూరు గ్రామం నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యంతో తరలిపోతున్న విషయం ముందుగానే తెలియడంతో నెలబల్లి వద్ద నిఘా ఉంచి లారీ(ఏపీ35వై5598)తో పాటు, డ్రైవర్ వినోద్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.


సింగిల్ హ్యాండ్‌తో పరుగుల వరద పారించిన వేదాంతపురానికి చెందిన మునిశేఖర్


క్రీడాకారులకు క్రికెట్ కిట్, ప్రశంసాపత్రాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సిక్సర్ల మోత

తుమ్మలగుంటలో జరుగుతున్న చంద్రగిరి ఐపీఎల్‌లో మూడో రోజు మంగళవారం సిక్సర్ల మోత మోగింది. పల్లెటూరి యువకుల బాదుడుకు బంతి మైదానం బయటకు పరుగులు పెట్టింది. బ్యాట్ చేతబట్టి మైదానంలోకి దిగిన యువకులు పరుగుల వర్షం కురిపించడంతో స్కోర్ బోర్డు తారజువ్వలా దూసుకుపోయింది. అంగ వైకల్యాన్ని జయించి ఒంటి చేత్తో సిక్సర్లు కొట్టిన వేదాంతపురానికి చెందిన మునిశేఖర్ అందరినీ ఆకట్టుకున్నాడు. మూడో రోజు మొత్తం 52 మ్యాచ్‌లు జరిగాయి.

- చంద్రగిరి ఐపీఎల్‌లో పరుగుల ప్రవాహం
- ఒంటి చేత్తో సిక్సర్లు బాదిన వేదాంతపురం సింగిల్ హ్యాండ్ సచిన్
- క్రీడాకారులతో మమేకమైన మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి
- 52 మ్యాచ్‌లతో కిక్కిరిసిన క్రీడామైదానం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంట వేదికగా జరుగుతున్న వైఎస్ఆర్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ముందుగా నిర్ణయించిన సమయానికి క్రీడాకారులు మైదానానికి చేరుకుని తమకు కేటాయించిన గ్రౌండ్లలో పోటీకి సిద్ధమవుతున్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి క్రికెట్ కిట్లు, మెడల్స్, ప్రశంసపత్రాలను మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అందించారు.

ఒంటి చేత్తో.. చితక్కొట్టాడు

సింగిల్ హ్యాండ్ సచిన్‌గా పిలిచే తిరుపతి రూరల్ మండలం వేదాంతపురానికి చెందిన మునిశేఖర్‌కు కుడి చేయి మాత్రమే ఉంది. ఆత్మస్థైర్యంతో బరిలోకి దిగాడు. ఒంటి చేత్తో సిక్సర్లు కొడుతూ మైదానంలో పరుగుల వర్షం కురిపించాడు. ఐదు సిక్సర్లు, నాలుగు ఫోర్లు కొట్టి 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతని బ్యాటింగ్ ప్రావిణ్యాన్ని చూసేందుకు క్రీడాకారులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అద్భుతమైన ఆటతీరుతో అంగవైకల్యాన్ని జయించి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు.

ఆటగాళ్లతో కిక్కిరిసిన క్రీడామైదానం

ఒకేసారి 16 మ్యాచ్‌లు నిర్వహించేందుకు భారీగా 16 పిచ్‌లను సిద్ధం చేయడం, ప్రతి గ్రౌండ్‌లోనూ మ్యాచ్‌లు జరుగుతుండడం, వాటిని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు సైతం తరలిరావడంతో తుమ్మలగుంట క్రీడా కాంప్లెక్స్ జన జాతరను తలపించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన మ్యాచ్‌లు సాయంత్రం 5.30గంటలకు ముగిశాయి. మొత్తం 52 మ్యాచ్‌లను నిర్వహించగా 26 జట్లు విజయం సాధించాయి. విజేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆయా గ్రౌండ్లలో ట్రోఫీలను బహుమతులుగా అందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


నింద్ర: మండలంలోని కొప్పేడు పంచాయతీ వేదాంతపురం వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడికి 50 ఏళ్లు ఉంటాయని, యాచకుడిగా గుర్తించామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి శంకర్ వెల్లడించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత


బాలికను తండ్రికి అప్పగిస్తున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు : పట్టణంలో నిర్వహిస్తున్న జాతరలో మంగళవారం తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారిని ఎట్టకేలకు తండ్రికి అప్పగించారు. చిన్నారి ఓ చోట నిలబడి ఏడుస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసుల వద్దకు చేర్చారు. వారు వెంటనే మైక్‌లో ప్రచారం చేయడంతో పాటు, సోషల్‌మీడియా ద్వారా బాలిక ఫొటోను వైరల్ చేశారు. కర్ణాటకలోని ముళబాగిలు సమీపంలోని జేబీ కొత్తూరు చెందని బాలిక తండ్రి ఈ విషయాన్ని గమనించి వెంటనే పోలీసులను సంప్రదించాడు. విచారించి తండ్రికి బిడ్డను అప్పగించినట్లు సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

జిల్లా సరిహద్దుల్లో ఒంటరి ఏనుగు


అటవీ ప్రాంతం వద్ద నిఘా పెట్టిన అటవీ అధికారులు


కూలిన కొబ్బరి చెట్టు

కుప్పంరూరల్ : మండలంలో ఇటీవల జంట ఏనుగులు విధ్వంసం సృష్టించిన విషయాలను మరువకముందే, ఒంటరి ఏనుగు రూపంలో మరో ముప్పు ఎదురైంది. మంగళవారం తమిళనాడు నుంచి జిల్లా సరిహద్దుల్లోకి ఒక ఒంటరి ఏనుగు చొరబడింది. కుప్పం మండలం తిర్లాబండ, బొగ్గులరేవు మధ్య సంచరిస్తోంది. దీంతో ఆయా ప్రాంతవాసుల్లో ఆందోళన మొదలైంది. అప్రమత్తమైన అధికారులు రెండు బృందాలుగా విడిపోయి ఒంటరి ఏనుగు కదలికను పరిశీలిస్తున్నారు. మరో ప్రాణం పోకుండా, ఏనుగు గ్రామాల వైపుకు రాకుండా చర్యలు చేపడుతున్నారు. ఈమేరకు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. సరిహద్దు ప్రాంత ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి రాకుండా దండోరా వేయించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేటలో సోమవారం రాత్రి పంట పొలాలపై ఏనుగులు దాడి చేశాయి. కోతకొచ్చిన వరి, మామిడి, చెరుకు పంటలను ధ్వంసం చేశాయి. చేతికొచ్చిన పంట నాశనమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిస్టరీ మంటల మూలాలపై ఆరా!

- కొత్తశానంబట్లలో ఇంటింటా పోలీసులు తనిఖీ
- బయటపడ్డ నాటు బాంబులు!


శానంబట్ల గ్రామంలో ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


పోలీసులకు సూచనలు ఇస్తున్న ఏఎస్పీ, డీఎస్పీలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, శానంబట్లలో 20 రోజులుగా గ్రామస్తులకు, అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న మిస్టరీ మంటల మూలాలపై పోలీసులు దృష్టి సారించారు. 60 మంది పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి మంగళవారం ఇంటింటా శోధించడం ప్రారంభించారు. చంద్రగిరి మండలం, కొత్త శానంబట్ల గ్రామంలో ఏడు గృహాలలో మంటలు చేలరేగడం, గడ్డివాములు కాలిపోవడం చర్చనీయాంశమైంది. ఉన్నట్లుండి ఓ మహిళ కట్టుకున్న చీర కాలిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గ్రామానికి అరిష్టం జరుగుతోందని గ్రామస్తులు మంత్రగాళ్లను ఆశ్రయించారు. గ్రామంలో ఇప్పటికే అష్టబంధనం కూడా చేశారు. గ్రామస్తుల ఆందోళనతో ఆ గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కానీ మంటలు ఆగకపోవడంతో మంగళవారం పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు యశ్వంత్, రవికుమార్, సురేష్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించి వివరాలు సేకరించారు. ఇంట్లో వస్తువులను తనఖీ చేశారు. కొత్తగా ఇంటికి బయట నుంచి బంధువులు కానీ, స్నేహితులు కానీ ఎవరైనా వచ్చారా అని విచారించారు. మంటలు ఏమైనా సంభవించాయా, మంటలు ఎలా సంభవించాయి అనేదానిపై ఆరాతీశారు.

ఏఎస్పీ పరిశీలన

చంద్రగిరి మండలం, కొత్తశానంబట్ల గ్రామంలో మంటలు చెలరేగిన ప్రదేశాలను తిరపతి ఏఎస్పీ కులశేఖర్ పరిశీలించారు. దీనిపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడారు. చిన్న అనుమానం వచ్చినా తమకు తెలియజేయాలని, గృహాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. మంటలు ఎలా చెలరేగాయి, ఎవరైనా ఆకతాయిలు పెట్టారా, లేక వేరే కారణాలు ఉన్నాయా అనే కోణంలో విషయాలు పరిశీలించాలన్నారు. అనుమానం వచ్చిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు.

మంటల మిస్టరీని ఛేదిస్తాం

శానంబట్ల గ్రామంలో మిస్టరీ మంటలను ఛేదిస్తామని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. శానంబట్ల గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజులుగా జరుగుతున్న ఈ తతంగంపై వివరాలు సేకరించామని, ప్రజలు క్షుద్రపూజలు, మూఢనమ్మకాలు నమ్మొద్దని తెలిపారు. మంటల మిస్టరీ ఛేదిస్తామని చెప్పారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, ఇక్కడే ఓ ఫైర్ ఇంజిన్ అందుబాటులో ఉంచామని తెలిపారు. కాలిన దుస్తులు, గడ్డిని ల్యాబ్‌కు పంపామని, ఫలితాలు రెండు రోజుల్లో వస్తాయన్నారు. ఎవరూ భయపడకుండా ఉండాలని ఆయన సూచించారు.

నాటు బాంబులు, టపాకాయలు స్వాధీనం?

శానంబట్ల గ్రామంలో మిస్టరీ మంటల విషయంలో పోలీసులు ప్రతి ఇంటినీ తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో పలు గృహాలలో నాటు బాంబులు, టపాకాయలు, విభూది స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. కేవలం తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పోలీసుల తనిఖీల పట్ల పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.